సాక్షి చిత్తూరు

మంగళవారం। 23। ఏప్రిల్। 2024



వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

పెనుమూరు మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ప్రచారం చేపట్టారు. - 8లో



'ఆరణి' అక్రమాలు..!

చిత్తూరులో పదవిని అడ్డుపెట్టుకుని 'ఆరణి', ఆయన అన్నకుమారుడు యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు చేరారు. - 8లో

న్యూస్‌రీల్

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ



రాకపోకలను పునరుద్ధరిస్తున్న ఎస్పీ మణికంఠ

పుంగనూరు : జిల్లాలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. సోమవారం పట్టణంలో నామినేషన్ల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఆర్‌ఓ కేంద్రాన్ని తనిఖీ చేశారు. టీడీపీ ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ ఇక్కట్లను స్వయంగా తొలగించి, రాకపోకలను క్రమబద్ధీకరించారు. అనంతరం విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పుంగనూరులో ప్రత్యేక దళాల బందోబస్తు నడుమ పోలింగ్ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అనుమానితులు, రౌడీ షీటర్లు, తీవ్రమైన నేర చరిత్ర గలవారిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలలో సామాన్యులు ధైర్యంగా ఓటు వేసేలా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. సమావేశంలో ఏఆర్‌ఓ నరసింహప్రసాద్ పాల్గొన్నారు.


ఎన్నికలకు వేతనంతో కూడిన సెలవు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో కార్మికులుగా పని చేస్తున్న కర్ణాటక ఓటర్లకు ఈ నెల 26 , మే 7వ తేదీన సెలవు ఇవ్వాలని జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో రెండు దశలుగా లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నందున ఆయా రోజుల్లో కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నారు. ఈ మేరకు కార్మిక కమిషనర్ శేషగిరిబాబు, జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే మే 13వ తేదీన రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా దుకాణాలు, వివిధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం వేతనం కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. సంబంధిత యజమానులు ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

రామకుప్పం: మండలంలోని ఎస్.గొల్లపల్లె సమీపంలో పంటపొలాలపై ఏనుగుల గుంపు ఆదివారం రాత్రి దాడి చేసింది. పలువురు రైతులకు చెందిన వేరుశనగ, బీన్స్, రాగి, అరటి పంటలతోపాటు గంట్లప్ప అనే రైతుకు చెందిన డ్రిప్ పరికరాలను నాశనం చేసింది. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని బాధితులు కోరారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలను అందించాయి.. విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులు పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశాయి.. సర్కారు బడుల్లో కల్పించిన సౌకర్యాలు విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునే వెసులుబాటు కల్పించాయి.. ప్రభుత్వ చిత్తశుద్ధిని పదో తరగతి ఫలితాలు రుజువు చేశాయి. సరైన ప్రోత్సాహం అందిస్తే పేద బిడ్డలు సైతం కార్పొరేట్‌కు ధీటుగా మార్కులు సాధించగలరని చాటి చెప్పారు. జిల్లాను రాష్ట్రంలోనే ఆరో స్థానంలో నిలబెట్టారు. ప్రైవేటు స్కూళ్ల కంటే అత్యుత్తమంగా రాణించి సత్తా చూపించారు.



జిల్లాలో పదో తరగతి ఫలితాలు విడుదల చేస్తున్న డీఈఓ దేవరాజు

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించినవారు

- బైరెడ్డిపల్లె మండలంలోని ఏపీరెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి సి.తన్మయి 592 మార్కులు సాధించి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.
- సదుం మండలంలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలలో చదివిన మణి, రామకుప్పం మండలం విజలాపురం జెడ్పీ హైస్కూల్‌లో చదివిన అఫ్షాన్ 589 మార్కులు సాధించి రెండో స్థానం దక్కించుకున్నారు.
- చిత్తూరులోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సంతోషి, కార్వేటినగరంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన యశ్వంత్, బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె మోడల్ స్కూల్ విద్యార్థిని మంజుల, గుడుపల్లె మండలం సోడిగానిపల్లె జెడ్పీ పాఠశాల విద్యార్థిని కావ్యశ్రీ, ఐరాల మండలం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని బిందుసాయి, బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కిరణ్‌కుమార్ 587 మార్కులు సాధించారు.

పదిలం.. దీటుగా ఫలితం

- పదోతరగతి ఉత్తీర్ణతలో జిల్లాకు 6వ స్థానం
- 20,939 మందికి గాను 19,113 మంది పాస్
- సత్తా చాటిన సర్కారు బడుల విద్యార్థులు
- 93.80శాతంతో పైచేయి సాధించిన బాలికలు
- ప్రైవేట్ స్కూళ్లలో 4,756 మంది..
- ప్రభుత్వ పాఠశాలల్లో 14,357 మంది ఉత్తీర్ణులు

కేటగిరీ	ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులు	పాస్ అయినవారు	ఉత్తీర్ణత శాతం
ఎయిడెడ్	139	194	95.57
బీసీ వెల్ఫేర్	116	121	100.00
ప్రభుత్వ	708	1078	79.38
కేజీబీవీ	258	290	95.71
మున్సిపల్	423	630	78.36
ఆదర్శ పాఠశాలలు	430	458	98.49
ప్రైవేట్ స్కూళ్లు	4,439	4,756	97.40
ఏపీ రెసిడెన్షియల్	111	112	100.00
ఏపీ సోషల్‌వెల్ఫేర్	442	472	98.74
ఏపీ ట్రైబల్‌వెల్ఫేర్	61	82	91.11
జిల్లా పరిషత్	8,336	10,920	88.39
మొత్తం	15,463	19,113	90.28

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు బడులు ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా రాష్ట్ర స్థాయిలో 6వ స్థానంలో నిలిచింది. ప్రైవేట్ యాజమాన్యాలను అధిగమించి ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఉత్తమంగా రాణించారు. గత టీడీపీ పాలనలో కార్పొరేట్ వ్యవస్థకు రెడ్ కార్పెట్ వేయడంతో ప్రైవేట్ స్కూళ్లదే ఆధిపత్యం ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మారులు తీసుకువచ్చింది. సర్కారు ప్రోత్సాహాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని అద్భుతంగా ఫలితాలు సాధించారు.

ప్రైవేట్ వెనుక 'బడి'..!

జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరంలో అన్ని యాజమాన్యాల నుంచి 20,399 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 19,113 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పది ఫలితాల్లో ప్రైవేట్ బడులు వెనుకబడ్డాయి. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ బడులలో 4,756 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల నుంచి పది పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 14,357 మంది ఉత్తీర్ణత సాధించారు

17 నుంచి ఆరోస్థానంలోకి

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో చిత్తూరు జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. సోమవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ పది ఫలితాలను విడుదల చేశారు. అనంతరం జిల్లా ఫలితాలను డీఈఓ కార్యాలయంలో డీఈఓ దేవరాజు విడుదల చేసి వివరాలు వెల్లడించారు. గత ఏడాది జిల్లా రాష్ట్రంలో 17వ స్థానంలో నిలవగా, ప్రస్తుతం 6 స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 20.27 శాతం ఫలితాలు పెరగడం విశేషం.

బాలికలదే హవా

పది పరీక్షలకు 10,793 మంది బాలురు హాజరుకాగా 9596 మంది ఉత్తీర్ణత చెందారు. అలాగే 10,146 మంది బాలికలు పరీక్షలు రాయగా 9517 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 88.91 శాతం, బాలికలు 93.8 మొత్తం 91.28 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

మొదటి డివిజన్‌లో 15,463 మంది

జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 15,463 మంది మొదటి డివిజన్‌లో ఉత్తీర్ణత సాధించారు. రెండో డివిజన్‌లో 2593 మంది, మూడో డివిజన్‌లో 1057 మంది మొత్తం 19,113 మంది ఉత్తమ ఫలితాలు సాధించారు.

వసతి గృహాల్లో 88.41 శాతం

జిల్లా వ్యాప్తంగా 37 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఇక్కడి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఈ వసతి గృహాల నుంచి 302 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. ఇందులో 267 మంది పరీక్షలు ఉత్తీర్ణత పొందారు. 88.41 శాతం ఉత్తీర్ణతతో సత్తీ చాటారు.

మే 24 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ

పదోవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24వ తేదీ నుంచి జూన్ 3 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 23 నుంచి 30 వ తేదీ లోగా అపరాధ రుసుం లేకుండా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు పరీక్ష ఫీజు చెల్లించాలి. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ అప్లికేషన్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రీ కౌంటింగ్ కు దరఖాస్తు చేసుకునే వారు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే వారు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున సీఎఫ్‌ఎంఎస్ చలానా ద్వారా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కేజీబీవీ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు

జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అధునాతనంగా తీర్చిదిద్దింది. ఈ పాఠశాలల్లో చదువుతున్న బాలికల చదువుకు పేదరికం ఏ మాత్రం అడ్డుకాకుడదని సకల సౌకర్యాలను కల్పించింది. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకున్న బాలికలు పది ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించారు. జిల్లాలోని 8 కేజీబీవీ పాఠశాలల్లో 5 బడులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. రామకుప్పం కేజీబీవీలో చదివిన నేత్ర 600 మార్కులకు 569, గుడుపల్లె కేజీబీవీలో పుష్పలత 565, బైరెడ్డిపల్లి, శాంతిపురం కేజీబీవీల్లోని మాధవి, మహేశ్వరి 552 మార్కులను సాధించి శభాష్ అనిపించుకున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు



నేతపై ఆధారపడి జీవించే కుటుంబం కావడంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే మా కుమారుడు సంతోష్‌ను చదివించాం. అయితే విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాఠశాల మెరుగుపడింది. టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం, ప్రతి గదికి వెలుతురు, గాలి బాగా ఉండేలా లైట్లు, ఫ్యాన్లు అమర్చారు. గ్రీన్ బోర్డు పెట్టారు. ప్రైవేటు పాఠశాల కంటే ప్రభుత్వ బడి మెరుగుపడింది. మా కుమారుడు మంచి పాఠశాలలో చదువుతున్నాడన్న ఆనందం మాకూ కలిగింది. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు 577 మార్కులు సాధించి మండలంలో రెండవ స్థానంలో నిలిచాడు. మాకు ఎంతో ఆనందంగా ఉంది. – బాలాజీ, హేమావతి

అందరూ శభాష్ అంటున్నారు



ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే అందరికీ చులకనగా ఉండేది. నేడు ఆ పరిస్థితి లేదు. పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో అవి కూడా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మారిపోయాయి. ఇక్కడే మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు. ఇంగ్లిషు మీడియం అందుబాటులో ఉంది. ఇంగ్లిష్ ల్యాబ్ ఉంది. చదువుతో పాటు ఆడుకునేందుకు కూడా పరికరాలు అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆరోగ్యంగా చదువుకుంటున్నారు. ఇలాగే మా కుమారుడు తమిళ్‌సెల్వన్ కూడా ప్రభుత్వ పాఠశాలలోనే బాగా చదువుకుని 577 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచాడు. అందరూ శబాష్ అంటున్నారు. మాకు గర్వంగా ఉంది. – విశ్వనాథన్, తేన్‌మొళి

మెరుగైన ఫలితాలు



ప్రైవేట్, కార్పొరేట్ బడులకు ధీటుగా జిల్లాలో సర్కారు బడుల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఎవ్వరికీ తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, డీవైఈఓలు, ఎంఈఓల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. – దేవరాజు, డీఈఓ, చిత్తూరు

మెరుగైన విద్య



మాది నగరి మున్సిపాలిటీ సత్రవాడ, మా ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన మెరుగు పడింది. నేతపై ఆధారపడి జీవించే కుటుంబం మాది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే మా కుమార్తె కార్తీకను చదివించాం. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఈ బడిలో వసతులను కల్పించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, బ్యాగు, విద్యా సామగ్రి అంతా ప్రభుత్వమే ఇస్తోంది. పదోతరగతికి ప్రత్యేక తరగతులు తీసుకొని బోధించారు. దీంతో మా కుమార్తె అత్యుత్తమ ప్రతిభను కనబరచింది. 580 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. మాకు ఎంతో సంతోషంగా ఉంది. – జగన్నాథన్, సుమిత

సత్తా చాటిన కవలలు



మా నాన్న సుధాకర్ బంగారు షాపులో పని చేస్తుంటారు. అమ్మ స్వప్న గృహిణి. మాది మధ్య తరగతి కుటుంబం. మేము కవల పిల్లలం. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాం. బీణసాయికి 565 మార్కులు వచ్చాయి. మా ఇద్దరి కల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనుంది. 587 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండల టాపర్‌గా నిలిచా. మా స్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు ప్రభుత్వం కల్పించిన వసతులను ఉపయోగించుకుని ఈ మార్కులు సాధించాం. అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించడంతో బాగా చదువుకున్నాం. – బిందు సాయి, బీణ సాయి, ఐరాల

వందశాతం ఉత్తీర్ణత



పదోతరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందని స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఎప్పటికప్పుడు వారి సామర్థ్యాలు మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవడమే ఉత్తమ ఫలితాలకు కారణమైందని వివరించారు. – శ్రీనివాసులురెడ్డి

బాబుకు ఓటమి భయం!



కుప్పం కోటపై చంద్రబాబుకు నమ్మకం సడలుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయం వెంటాడుతోంది. ఇన్నేళ్లుగా మోసిన జనం ఇప్పుడు ముఖం చాటేస్తుండడంపై ఆందోళన పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే టీడీపీ అధినేతకు తెలుగు తమ్ముళ్ల సమర్థతపై అనుమానం మొదలైంది. అందుకే ఇతర ప్రాంతాల నుంచి సొంత మనుషులను కుప్పానికి తరలిస్తున్నారు. ఎలక్షన్ మేనేజర్ల పేరిట నేతల ఇళ్లలో తిష్ట వేయిస్తున్నారు. ప్రచారం నుంచి తాయిలాల పంపిణీ వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేలా చర్యలు చేపడుతున్నారు. బాబు వ్యవహారశైలికపై స్థానిక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం త్యాగాలు చేసిన తమను విశ్వసించకుండా బయటి వారిని తెచ్చిపెట్టడంపై లోలోపల రగిలిపోతున్నారు.

- కుప్పం తమ్ముళ్లపై నిరంతర నిఘా
- ఎలక్షన్ మేనేజర్ల పేరిట సొంత మనుషులతో పర్యవేక్షణ
- బెంగళూరు..హైదరాబాద్ నుంచి తరలింపు
- అధినేత అపనమ్మకంపై టీడీపీ నేతల ఆవేదన

శాంతిపురం : కుప్పం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను నమ్మకుండా ప్రకాశం జిల్లా నుంచి తన సామాజికి వర్గానికి చెందిన కంచెర్ల శ్రీకాంత్‌కు చంద్రబాబు పెద్దపీట వేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఎన్నికల వేళ సైతం గ్రామ స్థాయిలోని పార్టీ కార్యకర్తలు, నాయకులపై కూడా అపనమ్మకంతో సొంత మనుషులతో నిఘా ఏర్పాట్లు చేస్తున్నారు.

వంద మంది మేనేజర్లు

కుప్పంలో ఎన్నికల పర్యవేక్షణకు బయటి ప్రాంతాల నుంచి తన సొంత మనుషులు వందమందిని చంద్రబాబు మోహరిస్తున్నట్లు తెలిసింది. తెలుగు దేశం పార్టీ వర్గాల సమాచారం ప్రకారం ప్రతి 3 పోలింగ్ కేంద్రాలకు ఒకరి చొప్పున ఎలక్షన్ మేనేజర్ల పేరుతో ఇక్కడికి తీసుకువస్తున్నారు. బెంగళూరులోని టీడీపీ ఐటీ ఫోరమ్ ద్వారా బెంగళూరు, హైదరాబాదులో గుర్తించిన దాదాపు వంద మందిని తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం కుప్పానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి దాదాపుగా రోజూ బెంగళూరు–కుప్పం మధ్య చక్కర్లు కొడుతున్నారు. ఆయా మేనేజర్లు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలోని టీడీపీ నాయకుల బంధువులుగా చెప్పుకుని వారి ఇళ్లలోనే బస చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా వచ్చే వారి బసకు ఇబ్బంది లేకుండా వసతులు ఉన్న నాయకుల ఇళ్లను ఇప్పటికే గుర్తించారు. ఈ నెల 26 నుంచి మే 12వ తేదీ రాత్రి వరకూ బయటి వ్యక్తులు స్థానికంగా మకాం వేసి పార్టీ వ్యవహారాలను నడపనున్నారు. ప్రచారం సాగాల్సిన తీరును పర్యవేక్షిస్తూ కింది స్థాయి నాయకులు, కార్యకర్తలను వారు సమన్వయం చేయనున్నారు. తమపై పరిశీలకుల కన్ను ఉంటే పార్టీ క్యాడర్ రాజీ పడకుండా పనిచేస్తారని ఈ ఏర్పాటుకు చంద్రబాబు ఆలోచన చేసినట్లు తెలిసింది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు జరిపే పంపకాలు కూడా వీరి ద్వారానే నిర్వహించి, పోలింగ్ ముందు రోజు రాత్రి వారంతా స్వస్థలాలకు వెళ్లి ఓటు వేసేలా వ్యూహరచన చేసుకున్నారు. కానీ ఇంత కాలం పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన తమను ఎన్నికల వేళ నమ్మకుండా అవమానిస్తున్నారని తెలుగు తమ్ముళ్లు కుమిలిపోతున్నారు. అలవి కాని హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకపోగా కాలకేయుల్లాంటి నాయకులను ప్రోత్సహించిన తమ అధినేత, ఇప్పుడు తమను చేతకాని వాళ్లుగా నిలబెడుతున్నారని ఓ సీనియర్ కార్యకర్త వాపోయారు. చివరకు ఎన్నికలకు ముందే చంద్రబాబు ఓటమి భయం రుచిచూస్తున్నారని వెల్లడించారు.

తగ్గిన జనాదరణ

కుప్పం నుంచి తొలుత 1989 ఎన్నికల్లో చంద్రబాబు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పుడు 52.65 శాతం ఓట్లు సాధించారు. తర్వాత ప్రత్యర్థి పార్టీల నాయకులను ప్రలోభ పెట్టి తన దారికి తెచుకోవడం ద్వారా నియోజకవర్గంపై క్రమంగా పట్టు బిగించారు. 1994లో గరిష్ఠంగా 75.49 శాతం ఓట్లు సాధించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రస్థానం ప్రారంభమైన తర్వాత కుప్పంలో కూడా బాబు ప్రభ తగ్గడం మొదలైంది. 2014లో 62.59 శాతం ఓట్లు రాగా, 2019లో 55.18 శాతం ఓట్లు మాత్రమే సాధించారు. అనంతరం వివక్ష లేని సుపరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అశేష ప్రజాదరణ సొంతం చేసుకున్నారు. కుప్పం ప్రజల మనసును గెలుచుకున్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం ప్రజలు సైతం వైఎస్సార్‌సీపీకే జైకొట్టారు. దీంతో అసలు సంగతి చంద్రబాబుకు బోధపడింది. ఇక కల్లబొల్లి కబుర్లను కుప్పం వాసులు నమ్మరని అర్థమైంది. అందుకే తరచూ కుప్పంలో పర్యటనలు ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో సైతం తన సతీమణి నారా భువనేశ్వరి చేతులమీదుగా నామినేషన్ వేయించారు. ఆమె కూడా కుప్పంలోనే మూడు రోజులపాటు తిష్ట వేసి నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

పుంగనూరులో నల్లారి ఫ్లాప్ షో

- కూటమి అభ్యర్థుల సభకు జనం కరువు
- తెలుగుదేశం నేతల కోడ్ ఉల్లంఘన
- బాణసంచా హోరు
- జనాలకు మద్యం



బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న జనం

పుంగనూరు: కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. సోమవారం రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లారామచంద్రారెడ్డి పట్టణంలోని గోకుల్ సర్కిల్ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. బాణసంచా పెద్ద ఎత్తున కాల్చారు. డీజేపాటలు పెట్టి డ్యాన్సులు చేశారు. మద్యాన్ని విచ్చలవిడిగా తాగించారు. ఆపై భోజనం రుచిగా లేదంటూ అద్దెజనం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కట్టుకథల కిరణ్

కూటమి అభ్యర్థుల సభ జనం లేక వెలవెలబోయింది. తొలుత చల్లా రామచంద్రారెడ్డి ప్రసంగిస్తుండగా జనం వెళ్లి పోతుండడంతో కిరణ్‌కుమార్‌రెడ్డి మైకు అందుకుని మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఆయన పలు విమర్శలు చేశారు. పాల దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఇదేంటి కిరణ్ ఇలా మాట్లాడుతున్నారంటూ గుసగుసలాడడం కనిపించింది.


రూ.300, క్వార్టర్

అద్దె జనానికి భారీగా నగదు, మద్యం పంపిణీ చేసినట్టు ఆయా పార్టీల కార్యకర్తలే చెబుతున్నారు. ఒక్కొక్కరికి రూ.300, క్వార్టర్ బాటిల్, బిరియానీ అందజేశారు. మద్యం షాపుల వద్ద టీడీపీ జెండాలు చేతబట్టిన కార్యకర్తలు కిక్కిరిసిపోయారు.

గంటల కొద్దీ జనం కోసం..

టీడీపీ అభ్యర్థి చల్లాబాబు బాలాజీ థియేటర్ వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి ఎంబీటీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రజలు నానాతంటాలు పడ్డారు. పలువురు శాపనార్థాలు పెట్టడం కనిపించింది. ర్యాలీకి జనం రాకపోవడంతో ముందుగా బాణసంచా భారీ ఎత్తున కాల్చారు. అలాగే డీజే పాటలు, డ్యాన్స్‌లతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. ర్యాలీకి వచ్చిన అద్దె జనానికి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద షామియానాలు వేసి భోజనాలు ఏర్పాటు చేశారు. మండుటెండలో తాగునీరు లేక, భోజనం రుచిగా లేకపోవడంతో ప్రజలు తినకుండా అక్కడే పడేసి వెళ్లడం కనిపించింది.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి



గంగమ్మ ఆలయంలో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప

పెద్దపంజాణి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పాలనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప కోరారు. సోమవారం మండలంలోని మాదనపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెడ్డెప్ప మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేకువనే సామాజిక పింఛన్లు అందాలన్నా.. పేద బిడ్డలకు ఉన్నత చదువులు అందుబాటులోకి రావాలన్నా.. పేదలకు ఖరీదైన వైద్యం అందాలన్నా రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా వెంకటేగౌడను, ఎంపీగా తను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.1.50 లక్షలు సీజ్

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం చేపట్టిన వాహనాల తనిఖీలో రశీదులు లేకుండా తరలిస్తున్న రూ.1.50లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఎస్‌టీ టీమ్ లీడర్ గణపతి తెలిపారు. తమిళనాడులోని తిరువణ్ణామలై నుంచి పలమనేరుకు వెళుతున్న ఐషర్ వాహనంలో నగదు పట్టుబడినట్లు వెల్లడించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీహరి, కానిస్టేబుల్స్ గోపి, మునిరత్నం పాల్గొన్నారు.

జగనన్నతోనే పంటలకు గిట్టుబాటు ధర

బంగారుపాళెం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకున్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ పాలేరు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలేదని, రైతులను మోసం చేస్తున్నారంటూ మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపణలు చేయడం సబబుకాదన్నారు. మామిడి, పాల ధరలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియంత్రిస్తున్నారని చేసిన విమర్శలు కూడా అర్థరహితమని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి గుజ్జు పరిశ్రమ యజమానులతో సమావేశాలు నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అదేవిధంగా పాల నాణ్యతను బట్టి లీటరుకు ధర నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. కిరణ్‌కుమార్‌రెడ్డి అసత్య ప్రచారాలు ఆపాలని హితవు పలికారు.


కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వి.కోట: జాతీయ రహదారిపై సోమవారం ఆటోలో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. ముల్బాగల్ తాలూకా పులిపాపేనహళ్లికి చెందిన వసంతకుమార్, వి.కోట మండలం జవునపల్లెకు కోదండరెడ్డి ఆటోల రూ.66 వేల విలువైన 11 కేసుల టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డారు.

'ఆరణి' అక్రమాలు..!



చిత్తూరు నగరంలోని సీతమ్స్ సమీపంలో అప్పటికే ఉన్న కూసాలను పడగొట్టి.. కబ్జా చేసిన భూమిలో కొత్తగా నాటించిన కూసాలు



చిత్తూరు మునిసిపల్ కమిషనర్‌తో పాటు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన 'ఆరణి'

ప్రజాధనానికి జవాబుదారీగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే అయినప్పటికీ ఎక్కడ అవకాశముంటే అక్కడ అవినీతికి తెరతీసేస్తారు.. కంచే చేను మేసినట్టు ఖాళీ భూమి కనిపిస్తే కబ్జా చేసేస్తారు.. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెట్టేస్తారు.. బాబాయ్ పదవిని అడ్డుపెట్టుకుని అబ్బాయ్ అక్రమాలకు పాల్పడతారు.. అన్న కుమారుడి క్రిమినల్ ఆలోచనలను సదరు ప్రజాప్రతినిధి తూచా తప్పకుండా అమలు చేసేస్తారు.. జేబులోని రూపాయి తీయరు.. యథేచ్ఛగా ఊరి మీద పడి దోచుకున్నారు.. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారు.. చివరకు చిత్తూరును సొంతం దిగమింగేశారు.. తమ అక్రమార్జనను కొనసాగించేందుకు కొత్తగా తిరుపతిని ఎంచుకున్నారు. దీంతో తిరునగరి వాసులు అప్రమత్తంగా ఉండాలని బాధితులు హెచ్చరిస్తున్నారు.

- అవినీతిలో బాబాయ్.. అబ్బాయ్ పోటాపోటీ
- ఇసుక దందాలో రూ.3 కోట్లకు పైగా స్వాహా
- తమ సిబ్బందికి సైతం ప్రభుత్వ ఖజానా నుంచి రూ.2.81 కోట్ల వేతనాలు
- కోవిడ్ కాలంలో మార్కెట్ గేటుకు రూ.52లక్షల ఎగవేత
- ఫోర్జరీ సంతకాలతో టెండర్ల భాగోతం
- చిత్తూరును సొంతం దిగమింగి.. తిరుపతికి పాకిన అనకొండలు

చిత్తూరు అర్బన్ : ప్రజలకు చిత్తశుద్ధితో సేవ చేయాల్సిన పదవిని 'ఆరణి' తన స్వార్థానికి వినియోగించుకున్నారు. వందల ఎకరాల ప్రభుత్వ భూమిని చెరపట్టారు. ఆయన అడుగు జాడల్లోనే వారి అన్న కుమారుడు సైతం భూ దందాలు చేస్తూ రూ.కోట్లకు పడగెత్తాడు. వీరి ఆగడాలను అడ్డుకోవడం ఎవరి తరం కాలేదు. చిత్తూరు 'శ్రీనివాసుడి' అక్రమాలు ఓవైపు .. అబ్బాయ్ క్రిమినల్ ఆలోచనలు చూసి ప్రజలు 'శివ' శివా..! అనుకుంటున్నారు. వీళ్లకు ప్రభుత్వ భూములా...? ప్రైవేటు భూములా అనే తేడాలేదు. తమకు నచ్చిందంటే కబ్జా చేసి కంచెలు వేసేస్తారు. చిత్తూరు బాబాయ్ 'ఆరణి'.. అబ్బాయ్ 'శివ' అవినీతి పర్వంలో కొన్ని..

ఫోర్జరీ మాయలు..!

- కరోనా సమయంలో చిత్తూరు మార్కెట్‌గేటు తన బినామీల పేరిట సొంతం చేసుకున్న 'ఆరణి'.. చిన్నా,చితకా వ్యాపారుల ముక్కుపిండి రూ.కోట్లు వసూలు చేశారు. అయినప్పటికీ కరోనా సమయంలో తాము ఆశించిన నగదు వసూలు కాలేదని, ఈ మొత్తాన్ని మాఫీ చేయాలని అధికారులను అడ్డుపెట్టుకుని కౌన్సిల్‌లో తీర్మానం చేయించారు. ఫలితంగా కార్పొరేషన్ ఖజానాకు రూ.52 లక్షల నష్టం వాటిల్లింది.
- బూత్‌బంగ్లాను తలపించే 'ఆరణి' ఇంట్లో, తన కంపెనీల్లో పనిచేయడానికి కొత్త స్కెచ్ వేశారు. తమ వద్ద పనిచేసే 27 మందిని మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చేర్పించారు. సొంత పనులకు వీళ్లను వాడుకుని, కార్పొరేషన్ నుంచి నెలకు రూ.18 వేల చొప్పున వేతనాలు ఇచ్చేలా చక్రం తిప్పారు. ఇలా 27 మందికి 58 నెలల పాటు రూ.2.81 కోట్లను వేతనాల రూపంలో కొల్లగొట్టారు.
- ఇక 2017లో బెంగళూరు గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఓ టెండర్‌లో పాల్గొనేందుకు 'ఆరణి' కంపెనీకి ఏదైనా కార్పొరేషన్‌లో రూ.వంద కోట్లకు పనులు చేసినట్లు ధ్రువీకరణ పత్రం కావాల్సి వచ్చింది. దీనికోసం చిత్తూరులోని ఇరువారం నుంచి గంగినేనిచెరువు వరకు కాలువ పనులు, చెరువుకట్టపై అభివృద్ధి పనులను చేసినట్లు ఓ సర్టిఫికెట్‌ను బెంగళూరు మహానగర పాలక (బీబీఎంపీ) అధికారులకు అందజేశారు. రూ.280 కోట్ల విలువైన ఈ పనుల్లో తాము తొలివిడతగా రూ.19.35 కోట్ల పనులు పూర్తి చేసినట్లు, దీనికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ బిల్లులు కూడా ఇచ్చేసిందని అందులో పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కమిషనర్, ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ సంతకాలను ఫోర్జరీ చేసి బీబీఎంపీ టెండర్లలో పాల్గొన్నారు. బెంగళూరు అధికారులకు అనుమానం వచ్చి, దీనిపై చిత్తూరు మున్సిపల్ అధికారులకు లేఖ రాశారు. దీన్ని 'ఆరణి' తొక్కిపెట్టడంతో ఏకంగా బీబీఎంపీ అధికారులు చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయానికి నేరుగా వచ్చి ఇక్కడి అధికారులను సంప్రదించారు. ధ్రువీకరణ పత్రంలోని సంతకాలు తమవి కాదని, అవి ఫోర్జరీ సంతకాలని తేల్చిచెప్పారు. దీంతో 'ఆరణి' కంపెనీపై బీబీఎంపీ అనర్హత వేటువేసింది. అయితే ఇది ఎవరి కంటాపడకుండా 'ఆరణి' వాస్తవాలను తొక్కిపెట్టేశారు. ఇన్నాళ్లకు పాపం పండడంతో నిజం వెలుగుచూసింది.
- చిత్తూరు మండలంలో 'ఆరణి' చేసిన ఇసుక దందా అంతా ఇంతాకాదు. తన కంపెనీకు చెందిన భారీ యంత్రాలతో యథేచ్ఛగా ఇసుకను తవ్వేసి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మేశారు. ఇలా మూడేళ్ల పాటు సుమారు రూ.3.24 కోట్ల విలువైన ఇసుక అక్రమాలకు పాల్పడ్డారు.

భూ బకాసురుడు..!

చిత్తూరులో ఆరణి చేసిన భూ దందాలనే ఆదర్శంగా తీసుకున్న శివ అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. చిత్తూరు భూ బకాసురుడిగా పేరుతెచ్చుకున్న తన బాబాయ్ 'ఆరణి' చేసిన అక్రమాల్లో శివ తనవంతు పాత్రను పోషించాడు.

- గుడిపాల మండలంలోని పానాటూరు వద్ద 22 ఎకరాల ప్రభుత్వ భూమిని తన బంధువుల పేరిట పట్టా ఇప్పించుకున్నాడు. దీనికి ప్రస్తుతం గేటు ఏర్పాటుచేసి పంటలు పండిస్తున్నారు.
- చిత్తూరు-బెంగళూరు బైపాస్ రోడ్డులో సీతమ్స్ కళాశాల సమీపంలో 74-తిమ్మసముద్రం రెవెన్యూ భూముల వద్ద ఓ అనామకుడి నుంచి రూ.కోటి విలువ చేసే భూములను బలవంతంగా లాక్కున్నారు. అసలు పట్టాదారులపై దౌర్జన్యం చేసి మరీ 2,800 అడుగుల భూమిని కబ్జా చేశారు. భూమికి సొంతవాళ్లు ఏర్పాటు చేసుకున్న ఫెన్సింగ్‌ను తొలగించి కొత్తగా కూసాలను నాటించేశారు.
- చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని తన అడ్డాగా మార్చుకున్న 'ఆరణి' అన్నకొడుకు.. ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడిగా తనుకు తానే ఓ పదవిని సృష్టించుకున్నాడు. పట్టణ ప్రణాళిక విభాగం నుంచి రూ.5 లక్షలు, రెవెన్యూ విభాగం నుంచి రూ.2 లక్షలు, ప్రజారోగ్య విభాగం నుంచి రూ.50 వేలు చొప్పున ప్రతీ నెలా మున్సిపల్ అధికారుల నుంచి మామూళ్లను ముక్కుపిండి మరీ వసూలు చేశాడు.

ఇన్ని అక్రమాలుచేసిన 'ఆరణి' తన అన్నకొడుకుతో కలిసి తిరుపతికి మకాం మార్చారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీచేస్తున్న 'ఆరణి' గురించి నిజాలు తెలిసిన తిరుపతి వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇంతటి ఘనుడిని అందలం ఎక్కిస్తే తిరుమల శ్రీనివాసుడికే నామాలు పెట్టడం ఖాయమని భయపడుతున్నట్లు సమాచారం.

నాలుగో రోజు 39 నామినేషన్‌లు



ఆర్‌ఓ షణ్మోహన్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప



కుప్పంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి దుర్గ



చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులుకు నామినేషన్ పత్రం అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం నాలుగో రోజు 36 మంది 39 సెట్ల నామినేషన్లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దాఖలు చేశారు. జిల్లాలోని చిత్తూరు పార్లమెంట్, మిగిలిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్‌లు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు. చిత్తూరు పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఏడు సెట్లు నామినేషన్‌లను దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో ఆర్‌ఓ షణ్మోహన్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున రెడ్డెప్ప 2 సెట్లు, ఆయన భార్య రెడ్డెమ్మ 2 సెట్లు, నాగేశ్వరరావు (జాతీయ జనసేన పార్టీ) -1 సెట్, జానకిరామారావ్ (నేషనల్ మహాసభ పార్టీ)-1, చిట్టిబాబు (కాంగ్రెస్) -1 సెట్ నామినేషన్ వేశారు. చిత్తూరు అసెంబ్లీ పరిధిలో ప్రభాకర్‌రెడ్డి (ఇండిపెండెంట్), ప్రతిమ (టీడీపీ-2 సెట్లు), ఇందుమతి (వైఎస్సార్‌సీపీ తరపున)-2 సెట్లు, ఇండిపెండెంట్-2 సెట్లు), తుకారామ్-1 (కాంగ్రెస్) నామినేషన్‌లను ఆర్‌ఓ శ్రీనివాసులుకు అందజేశారు. పుంగనూరు నియోజకవర్గంలో 5 మంది అభ్యర్థులు 5 సెట్లు, నగరిలో ఒక అభ్యర్థి, జీడీ నెల్లూరులో నలుగు గురు అభ్యర్థులు, పూతలపట్టులో 6 మంది అభ్యర్థులు 7 సెట్లు, పలమనేరులో 6 మంది అభ్యర్థులు 6 సెట్లు, కుప్పంలో 6 మంది అభ్యర్థులు 6 సెట్లు నామినేషన్‌లను ఆయా ఆర్‌ఓలకు సమర్పించారు. కుప్పంలో భరత్ తరఫున (వైఎస్సార్‌సీపీ) ఆయన సతీమణి దుర్గ నామినేషన్ అందజేశారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు



పార్టీలో చేరిన మైనారిటీ నేతలతో ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

పుంగనూరు : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు భారీగా చేరారు. అందులో భాగంగా సోమవారం పుంగనూరులో ముస్లిం నేతలు ఎంఎం సాధిక్, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్ ఆధ్వర్యంలో రాంనగర్ కాలనీకి చెందిన అబ్బొడు, శీన, రాజా, వెంకటేష్, సుధా, సిద్దప్ప, ధన, మధు, మున్వర్‌సాబ్, జలీల్‌సాబ్, అక్బర్, రహీమ్, సాఖత్, జావీద్, అక్రమ్, సైపుల్లా, కరీంసాబ్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: గుడిపాల మండలం బసవపల్లె పంచాయతీ దళితవాడకు చెందిన టీడీపీ నాయకులు చంద్రబాబు, రాజేష్, అన్బు, సతీష్, విజయ్‌కుమార్, సురేష్, ఆనంద్‌రాజ్, అల్వార్, ఇమాన్, అరుణ్, మునిరాజ్, శశి, నవీన్, నరేష్, అర్విన్‌లతో కలిపి మొత్తం 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగరానికి చెందిన మైనార్టీ నాయకులు ముజీబ్, ఫైరోజ్, జునీద్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు.

గంగవరంలో..

గంగవరం : మండలంలోని నల్లసానిపల్లి గ్రామానికి చెందిన దాదాపు 15 కుటుంబాలవారు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సుబ్రమణ్యం, చిట్టిబాబు, వెంకటరమణ, పెద్దన్న, అమరనాథ్, రమణయ్య, జగదీష్, గజేంద్ర, మంజుల, చిన్నబిడ్డమ్మ, నరేంద్ర, శ్రీనివాసులు, టి.వెంకటరమణ ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, మోత్కుపల్లి మణి, చెన్నకృష్ణ, శంకరయ్య, నారాయణ, అమరేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పంరూరల్: మండలంలోని యనమనాశపల్లె, పరకుంట్ల గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో వెంకటాచలం ,రాజశేఖర్, నాగరాజు, శంకరప్ప తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక, నాయకులు సురేష్, శంకరప్ప, శ్రీరాములు, మణి, ప్రకాశ్, చంద్రప్ప పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

పెనుమూరు(కార్వేటినగరం) : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికార పగ్గాలు చేపడతారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం స్పష్టం చేశారు. సోమవారం పెనుమూరు మండలం పెద్ద కావూరివారిపల్లె, మోపిరెడ్డిపల్లె, గుడ్యాణంపల్లె పంచాయతీల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మికి ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ నానాజాతి సమితిగా కూటమి కట్టిన పార్టీలు ఒక్క వైపు ఉంటే, సంక్షేమం, చక్కటి అజెండాతో ప్రజా ఆశీస్సులు కోరుతూ జగనన్న ఒక్కరే ఓ వైపు ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్, మండల మాజీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, ఎంపీపీ హేమలతరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, నియోజకవర్గ మహిళ అధ్యక్షులు యశోదారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కమలాకరరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, వైస్ ఎంపీపీ కోదండన్, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణారెడ్డి, మండల యువత అధ్యక్షుడు లోకేష్ రెడ్డి, నేతలు పులికల్లు బాలాజీరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, దేవరాజులు రెడ్డి, గంధం ముని, నీలా పండరినాథ్, గంగుపల్లె రవి, మాజీ సర్పంచ్‌లు ఎస్.నరసింహారెడ్డి, పి.ఈశ్వరరెడ్డి, రాజారెడ్డి, దాము పాల్గొన్నారు.

విచ్చలవిడిగా 'పచ్చ' ప్రలోభాలు!



విందు వద్ద తమ్ముళ్లు, జనం

పూతలపట్టు/కాణిపాకం : టీడీపీ నేతలు యథేచ్ఛగా కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. సోమవారం పూతలపట్టులో ఈ మేరకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మురళీమోహన్ నామినేషన్ చేసేందుకు గాను జనసమీకరణకు డబ్బులు వెదజల్లారు. ప్రతీ పంచాయతీకి వాహనాలు పంపించి జనాన్ని తరలించే యత్నించారు. 40కుపైగా బస్సులు, 20కుపైగా ట్రాక్టర్లు, ఆటోలు 50, లారీలు, ఐషర్ వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలను పూతలపట్టుకు తీసుకొచ్చారు. ఇందుకు గాను రూ.5 లక్షల వరకు ఖర్చుపెట్టినట్లు తమ్ముళ్లే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. నామినేషన్‌కు తీసుకువచ్చిన వారికి పెళ్లిపేరుతో విందు ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన ఓ పెళ్లి జంట బ్యానర్ వేసి బహిరంగంగానే విందు పెట్టారు. ఈలెక్కన విందుకు రూ.5 లక్షల వరకు ఖర్చుచేసినట్టు తెలుస్తోంది. అలాగే మద్యం పంపిణీ షరా మామూలుగానే సాగింది. కాగా, వచ్చిన జనాలకు అందించిన మొత్తం దాదాపు రూ.10లక్షలు దాటినట్లు ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు.

డబ్బు కొట్టు.. జెండా కట్టు..!



పలమనేరు సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టించుకుంటున్న పచ్చ కార్యకర్తలు.

పలమనేరు : పట్టణంలో సోమవారం జరిగిన టీడీపీ అభ్యర్థి అమరనాథ రెడ్డి నామినేషన్ సందర్భంగా జనాలకు మద్యం, నగదు పంపకాలు జోరుగా సాగాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, వెంకటేగౌడ నానినేషన్ కార్యక్రమానికి 30వేల మంది వరకు హాజరుకావడంవతో టీడీపీ నేతలు ఉలిక్కిపడ్డారు. పరువుపోతుందనే భయంతో అమరనాథ రెడ్డి సైతం జన సమీకరణకు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. ఆమేరకు వి.కోట నుంచి బైక్‌లో వచ్చేవారికి రూ.300, పెట్రోలు, బిర్యానీ, మద్యం, బైరెడ్డిపల్లె నుంచి వచ్చేవారికి రూ.150 పెట్రోలు, భోజనం పంచిపెట్టినట్లు ఆయా వాహనాలను జెండా కట్టినట్లు సమాచారం. అలాగే కుప్పం, కర్ణాటక సరిహద్దు గ్రామాలు, మదనపల్లె, పూతలపట్టు నియోజకవర్గాలనుంచి సైతం జనాలను రప్పించారు. వీరికి మాత్రం మనిషికి రూ.400 దాకా పంపిణీ చేసినట్టు తెలిసింది.

41 మంది వలంటీర్ల రాజీనామా

పూతలపట్టు: మండలంలోని పోలవరం, గొడుగుచింత, వావిల్‌తోట, అయ్యప్పగారిపల్లె పంచాయతీ పరిధిలోని 41 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ప్రసన్నకుమారికి అందజేశారు. టీడీపీ, జనసేన నాయకులు వేధింపులకు మనస్తాపంతో రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

విశ్వంలో ఉచిత ఏపీఆర్‌జేసీ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్ రేపు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్లో బుధవారం ఉదయం 10 గంటలకు విద్యార్థులకు ఏపీఆర్‌జేపీ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్ ఉచితంగా నిర్వహించనున్నట్లు విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలియజేశారు. ఏప్రిల్ 25న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు, ఈ ఉచిత నమూనా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ జిరాక్స్ కాపీతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.